చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా తప్పదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా విధిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన 7,8,10,12 సర్కిల్స్ పరిధిలోని వెంకట్ నగర్, రాజ్యలక్ష్మి నగర్, మెయిన్ రోడ్ , ఆదిత్య పీజీ కాలేజ్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. చెత్తను రోడ్లపై వేసే వ్యాపారులకు జరిమానాలు విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలను ఆదేశించారు. అనంతరం గృహ సముదాయాల వద్ద చెత్త సేకరణ తీరును పరిశీలించారు. ఇంటింటికి చెత్త సేకరణ, చెత్తను విభజించి ఇస్తున్న విధానాన్ని పర్యవేక్షించి అక్కడ ఉన్న ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట శానిటరీ సూపర్వైజర్ జిలాని, ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచార సామగ్రిని ఆవిష్కరిస్తున్న జెసి ఇలాక్కియా

జన సురక్షా పథకాలపై జూన్ 30 వరకు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - కాకినాడ

అర్హులైన ప్రతి ఒక్కరినీ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై), ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పిఎంఎస్‌బివై) పథకాల్లో చేర్చేందుకు మంగళవారం నుంచి జూన్ 30వ తేదీ వరకు గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు జెసి ఎస్.ఇలక్కియ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రెండు శిబిరాలకు సంబంధించిన ప్రచార సామగ్రిని జెసి ఇలక్కియ ఆవిష్కరించారు. . 385 గ్రామ పంచాయతీల స్థాయిలో ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహించాలని.. గ్రామ సచివాలయాల సిబ్బంది, వాలంటీర్‌లను సమన్వయం చేసుకుంటూ శిబిరాల సమాచారాన్ని, పథకాల ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన 18-50 ఏళ్లలోపు వారికి అందుబాటులో ఉంటుందని ఈ పథకంలో చేరేందుకు ఏడాదికి రూ. 436 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం 18-70 ఏళ్ల వారికి వర్తిస్తుందని ఈ పథకంలో చేరేందుకు ఏడాదికి రూ.20 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. చాలా తక్కువ ప్రీమియంతోనే మంచి బీమా భద్రత ఉండే ఈ పథకాల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ చేరేలా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో శిబిరాల వద్ద నీడ, మంచి నీటి సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎల్‌డిఎం నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని బ్యాంకర్లు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ ఎన్‌వీవీ సత్య నారాయణ, ఎల్‌డిఎం ప్రసాద్, లీడ్ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజనల్ హెడ్ డివి రంగారావు, నాబార్డు డిడిఎం డాక్టర్ వై.సోమునాయుడు, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, డిపిఒ ఆర్.విక్టర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

విద్యార్థులకు పథకాలు అందేలా చూడాలి...

ప్రజాశక్తి - గండేపల్లి

మల్లేపల్లి జడ్‌పి హైస్కూల్‌లో ఉన్న జెవివి స్టాక్ పాయింట్ సిఎంఒ చామంతి నాగేశ్వరరావు పరిశీలించారు. జెవివి కమిటీతో సమావేశం నిర్వహించారు. నాలుగో విడత జగనన్న విద్యా కానుకను ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అందరి విద్యార్థులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంఇఒ హెచ్ నాయక్, మండల ఎపిఎం సన్యాసి రావు, హెచ్‌ఎం సుధా మాధురి, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు..

క్రీడలకు ప్రోత్సాహం కరవు

- వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు నిధులు నిల్
- ప్రభుత్వం మొండి చేయి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్రీడలకు ప్రోత్సాహం కరవైంది. ప్రధానంగా వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు నయా పైసా నిధులు విడుదల చేయకపోవడంతో కోచ్‌లు, క్రీడాకారులు ఆసక్తిని కనబర్చలేక పోతు న్నారు. మరోవైపు పేద విద్యార్థులకు క్రమంగా క్రీడలకు దూరమవుతున్నారు. ప్రతి సంవత్సరం జిల్లా వ్యాప్తంగా జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. మే 1 నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ శిబిరాల్లో ఐదు నుంచి 15 ఏళ్ల బాలురకు వాలీబాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్,బాలికలకు బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాలలో శిక్షణ ఇస్తారు. క్రీడా విభాగం సిబ్బందితో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8.30 వరకూ, సాయంత్రం 4 నుంచి 7.30 వరకూ 6 నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు శిక్షణ ఉంటుంది.

అనాసక్తి

వేసవి క్రీడా శిబిరాలకు ప్రభుత్వం గత రెండేళ్ల నుంచి నిధులు విడుదల చేయడం లేదు.ఏటా శిక్షణ శిబిరాలపై అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో సౌకర్యాలు కల్పించలేకపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. గతేడాది నిర్వహించిన శిక్షణ శిబిరాల తీరే ఇందుకు నిదర్శనం. గత ఏడాది 100 శిబిరాలను నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా తీసుకోగా క్రీడాకారులు ఆసక్తిని కనబరచక పోవడంతో 50 మాత్రమే నిర్వహించారు. జిల్లాల విభజన తర్వాత కాకినాడ జిల్లాకు ఈ ఏడాది కూడా ప్రత్యేకంగా 50 శిక్షణ శిబిరాలు నిర్వహించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కార్యాచరణను కూడా సిద్ధం చేశారు. రూ 300 నుంచి 500 వరకు రిజిస్ట్రేషన్ ఫీజును వసూలు చేస్తారు. క్రీడా సంఘాలు పిఇడీలు, పిఇటీలు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అయితే ఈ శిబిరాల్లో పాల్గొనేందుకు కొందరు వెనకడుగువేస్తు న్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం, సరైన ఏర్పాట్లు చేయకపోవడమే ఇందుకు కారణంగా చెబుతు న్నారు. ఆటవస్తువులు, కోచ్‌లకు పారితోషికాలు, తాగు నీరు, ఉదయం, సాయంత్రం అల్పాహారం వంటివి కూడా ఇవ్వడం లేదు. క్రీడాకారులే ఇవన్నీ సమకూర్చు కోవాల్సి వస్తుంది. వాస్తవానికి శిక్షణ శిబిరాల వద్ద మంచి నీరు, క్రీడా పరికరాలు వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. గతంలో ఒక శిబిరం నిర్వహిస్తే కోచ్‌కు ప్రోత్సాహకంగా రూ.2వేలు పారితోషికం ఇచ్చేవారు. ఆట వస్తువులకు రూ.7 వేలు, గ్రౌండ్ నిర్వహణకు రూ.1000 ఇచ్చేవారు. అయితే గత రెండేళ్లుగా వీటిని నిలిపివేశారు. శిక్షణలో భాగంగా ఇచ్చే ఫిట్‌నెస్ పరికరాలను క్రీడాకారులే సొంతంగా తెచ్చుకుంటున్నారు. వాటిని కొనుగోలు చేయలేని పేద క్రీడాకా రులు శిక్షణకు దూరమవుతున్నారు. క్రీడా ప్రాధికార సంస్థ గతేడాది దాతలు ఇచ్చిన సొమ్మును ఖర్చు చేశారు. ఈ ఏడాది పరికరాల కొనుగోలుకు, క్రీడాకారుల సౌకర్యాల కోసం ఏనిధులు ఎలా ఖర్చు చేస్తారనేది ప్రశ్నార్థకం.

ఖోఖోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియం

ఈ నెల 15 వరకూ అవకాశం

శిక్షణ శిబిరాల్లో పాల్గొనే వారు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలి .నెల రోజుల పాటు సాగనున్న వేసవి శిక్షణ శిబిరాల అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తాం. అయితే ప్రభుత్వం నుంచి నిధుల విడుదల కావడం లేదు. దాతల సహకారంతో శిబిరాలను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

శ్రీనివాస్ కుమార్, చీఫ్ కోచ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, కాకినాడ

ఉచితంగా శిక్షణ ఇవ్వాలి

వేసవి శిక్షణ శిబిరాలలో ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేయకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి అన్ని పరికరాలను అందుబాటులో ఉంచి ఉచితంగా శిక్షణ ఇవ్వాలి. క్రీడల వారీగా పే అండ్ ప్లే విధానాన్ని తొలగించాలి. ఖరీదైన పరికరాలను కొనుగోలు చేయలేక పేద విద్యార్థు క్రీడలకు దూరమవుతున్న పరిస్థితులున్న నేపథ్యంలో ప్రభుత్వం వారిని ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలి.

లంక జార్జ్, పిఇటి, పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

పారిశ్రామిక ప్రమాద బాధితులకు భరోసా

ప్రజాశక్తి - కాకినాడ

పారిశ్రామిక ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని కాకినాడ జిల్లా కలెక్టర్ కలెక్టర్ శుక్లా, కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు అన్నారు. 2021, మార్చి 11వ తేదీన కాకినాడ గ్రామీణం, సర్పవరంలోని టైకీ ఇండస్ట్రీస్‌లో జరిగిన ప్రమాదంలో మరణించిన ఇద్దరు కార్మికులు, గాయపడిన నలుగురు కార్మికులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి రూ.24 లక్షలు ఆర్థిక సహాయం మంజూరైంది. మంగళవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. ప్రమాదంలో మరణించిన వ్యక్తులు కాకర్ల సుబ్రహ్మణ్యం, తోటకూర వెంకటరమణ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చొప్పున అందజేశారు. ప్రమాదంలో గాయపడిన కలగ సత్య సాయిబాబు, కుడిపూడి శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి రావు, రేగెల్ల రాజ్ కుమార్ కుటుంబ సభ్యులకు రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ దురదృష్టవశాత్తు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తోందని తెలిపారు. శాసనసభ్యులు కురసాల కన్నబాబు బాధిత కుటుంబాలకు మేలు జరగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి దష్టికి విషయాన్ని తీసుకెళ్లారన్నారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా కూడా ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు అర్హత మేరకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కుటుంబంలో పిల్లలకు చదువు పరంగా ఏ సాయం కావాలన్నా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ఆ లోటును కొంతవరకైనా తీర్చాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరక్కుండా ఫ్యాక్టరీల చట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టం-1986, రాష్ట్రస్థాయి కమిటీల నిబంధనల మేరకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని అన్ని పరిశ్రమలకు ఆదేశాలిచ్చామని పరిశ్రమల్లో ప్రమాదాలు జరక్కుండా పరిశ్రమలు, కాలుష్య నివారణ, విపత్తు నిర్వహణ, రెవెన్యూ, కార్మిక తదితర శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు తనిఖీలు చేస్తున్నాయని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ సాయంతో కలుపుకుంటే మరణించిన వారి కుటుంబాలకు రూ. 50 లక్షలు చొప్పున, బాగా గాయపడిన వారి కుటుంబాలకు రూ. 11 లక్షలు చొప్పున, గాయపడిన వారి కుటుంబాలకు రూ. 6 లక్షలు చొప్పున సహాయం అందినట్లు వివరించారు. పరిహారం సొమ్మును సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు నిబంధనలకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎంఎల్ కన్నబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.శ్రీధర్‌రెడ్డి, రూరల్ తహశీల్దార్ మురార్జీ తదితరులు హాజరయ్యారు.

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎంఎల్‌ఎ కన్నబాబు

కాకినాడలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సామాజిక విప్లవకారుడు జ్యోతిరావ్ ఫూలే

ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ముఖ్యకేంద్రాల్లో ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జ్యోతిరావు పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే ఆశయసాధనకు ప్రజలంతా కృషి చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు.

కాకినాడ అంబేద్కర్ భవన్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, జి.బేబీ రాణి నివాళులర్పించారు. ఎం.రాజ శేఖర్, సిపిఎం జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే భారతదేశ తొలి సామాజిక విప్లవకారుడని, విద్య యొక్క గొప్పతనాన్ని గుర్తించి అణగారిన వర్గాలకు విద్యను అందించిన మహోన్నతుడు అని కొని యాడారు. సిపిఎం నాయకులు కె.ఎస్. శ్రీనివాస్, సిహెచ్. అజయ్ కుమార్, కె.సింహాచలం, కె.వీరబాబు, మేడిశెట్టి రమణ, మలకా రమణ, దినేష్ పాల్గొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ నివాళులర్పించారు. కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల, ఎంపీ వంగా గీత, ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు, సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, షేక్ అబ్దుల్ బషీరుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్ :** జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు, ఎఎస్‌పి శ్రీనివాస్, టిడిపి జిల్లా కార్యాలయంలో మాజీ ఎంఎల్‌ఎ కొండబాబు, చిక్కాల రామ చంద్ర రావు ఆధ్వర్యంలో, ఎస్‌సి, ఎస్‌టి సెల్ సభ్యులు డోకుబుర్ర భద్రం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. **కాకినాడరూరల్** రమణయ్యపేట వైసిపి క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత తహశీల్దార్ రేలంగి బాపిరాజు, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు. **కరప** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తి బాబు ఆధ్వర్యంలో, గురజానపల్లి హై స్కూల్లో హెచ్ ఎం బి.ఆర్.వి ప్రసాద రావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. **సామర్లకోట** రైతు భవన్‌లో పెద్దాపురం నియోజకవర్గం వైసిపిఇన్చార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నయామ్ అహ్మద్, పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్ర దేవి, రాష్ట్ర కార్మిక సంఘ నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి శ్రీలలిత, కార్యాలయం ఎఒ విప్పర్తి వీరసాయిబాబు, ఇన్‌చార్జి ఇఒపిఆర్‌డి వై శ్రీహరి సిబ్బంది, ఉద్యోగులు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనరసకుమారి, డిప్యూటీ తహశీల్దార్‌లు ఆర్.శ్రీనివాసు కృష్ణ, ఆర్.ఐ ఆర్ రాజేష్, విఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సిఐటియు జిల్లా నాయకులు డి క్రాంతి కుమార్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు బి.అనంతరావు, పెద్దింటి సీతన్న, సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, నీలపాల సూరిబాబు, రొంగల సుబ్బలక్ష్మి, యుటిఎఫ్ నాయకులు కట్టమూరు సూరి బాబు, ప్రజానాట్యమండలి నాయకులు దారపు రెడ్డి కష్ణ,రొంగల వీర్రాజు,డి సత్యనారాయణ,మహాపాతిన రాంబాబు,అమత పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్,కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జె సురేంద్రల ఆధ్వర్యంలో, టిడిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన రాజప్ప ఆధ్వర్యంలో, ఎంపిడిఒ కార్యాలయంలో ఎండిఒ కె హిమ మహేశ్వరి, జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకె సత్యవతి నివాళులర్పించారు. **తాళ్లరేవు** విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ప్రజా సంఘాలు, పూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు టిల్లపూడి నాగేశ్వరరావు స్టడీ సర్కిల్ ప్రతినిధులు గుత్తుల మల్లేశ్వరరావు, ప్రకతి కుమార్ పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలం జె.కొత్తూరులో ప్రగతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీదేవి, ప్రగతి యూత్ అసోసియేషన్ సభ్యులు, జె కొత్తూరు రెవిన్యూ అధికారి నరసింహారావు, ప్రముఖ పారిశ్రామిక వేత్త శివ కుమార్, సచ్చిదాల రవి శంకర్ నాయుడు నివాళులర్పించారు. **ఏలేశ్వరం:** ప్రత్తిపాడు కోర్ట్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగతా శివ, న్యాయవాదులు రాజాల చిట్టిబాబు, బండారు నరసింహారావు, లింగంపల్లి శివకుమార్, కె సుజన, గాడి రవిచంద్ర పాల్గొన్నారు. **రౌతులపూడి:** మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ. పాఠశాలలో ను మంగళవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కాకినాడలో నివాళులర్పిస్తున్న ఎంపి బోస్, కలెక్టర్ కృతికా శుక్లా

తాళ్లరేవులో ప్రజాసంఘాల నివాళి

పెద్దాపురంలో సిఐటియు నాయకుల నివాళి

రౌతులపూడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నివాళి

వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తున్న ఎంఎల్‌ఎ కన్నబాబు, జెసి ఇలాక్కియా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- యాంత్రికరణ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి -కరప

గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా, ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌ఎ కన్నబాబు, జెసి ఇలాక్కియా పాల్గొన్నారు. ఇచ్చేశారు. దళారులు బారిన పడకుండా రైతు నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవచ్చని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించడమే కాకుండా రైతు బ్యాంకు ఖాతాలో ఆ సొమ్ములు జమ అవుతాయని వారు వివరించరు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏడు రైతు మిత్ర గ్రూపులకు 40 శాతం రాయితీపై రూ75,10,402 విలువచేసే టాక్టర్లు ,పవర్ టెల్లర్సు తదితర వ్యవసాయ యంత్ర పరికరాలు రూ28,46,720 రాయితీపై కన్నబాబు రైతులకు అందిం చారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు ఎంపిపి పెంకి శ్రీలక్ష్మి సత్తిబాబు, వ్యవసాయ అధికారులు ఎవి రాజేష్ ఎంపిడిఒ కె.స్వప్న, తహాశీల్దార్ పి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ఆశాజ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రిడిటియేషన్ కమిటీలో యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలి

- ఫెడరేషన్ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం

ప్రజాశక్తి - కాకినాడ

జర్నలిస్టులకు అక్రిడిటియేషన్ మంజూరు కోసం ఏర్పాటు చేసే అక్రిడిటియేషన్ కమిటీల్లో యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ రాజ్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటియేషన్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒలతో యూనియన్లకు ప్రాతినిధ్యం లేకుండా చేయడాన్ని వారు ఖండించారు. ఈ మేరకు ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టర్ కృతికాశుక్లాకు జర్నలిస్టుల ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ మున్నీ, వి.నానాజీ, వి శ్రీనివాస రావు, త్రినాథ్, గోపి, ముమ్మిడి లక్ష్మణ్, రాము, కరుణాకర్, సుబ్బారావు, హరి, అనిల్, కొండ, తదితరులు పాల్గొన్నారు.

బీమా మంజూరుకు వినతి

ప్రజాశక్తి - కాకినాడ

ఇటీవల మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వాసంశెటిట్ట దుర్గాప్రసాద్ కుటుంబానికి బీమా మంజూరు చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆధ్వర్యంలో కాకినాడలో స్థానిక అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 6వ తేదీన వాసంశెట్టి దుర్గాప్రసాద్ ఎస్.అచ్యుతాపురం రైల్వే గేట్ సమీపంలో శివం విహార్ అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ అపార్ట్‌మెంట్ పై నుండి కిందపడి మృతి చెందాడు. ఈ మేరకు మృతుని కుటుంబానికి బీమా మంజూరు చేయించాలని, ఈ మేరకు అధికారులు సహకరించాలని ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో మృతుని భార్య పావని, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

ఇక్కడ మేకవన్నె పులులు ఎక్కువ మరి

200 రోజుల్లో 60 వేల గడపల సందర్శన

అచ్చంపేటలో 200వ రోజు గడప గడపకూ..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

200 రోజుల పర్యటనలో పెద్దాపురం నియోజకవర్గం పరిధిలో సుమారు 60వేలకు పైగా గడపలను సందర్శించినట్లు ఏపీ స్టేట్ హౌసింగు కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు చెప్పారు.గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం 200 రోజుకు చేరుకోవడంతో సాయంత్రం సామర్లకోట మండలం అచ్చంపేటలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో హౌసింగు బోర్డు చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొని కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భముగా దొరబాబు మాట్లాడుతూ ఈ 200 రోజులల్లో నియోజకవర్గంలో సుమారు 60 వేల గడపలకు పైగా సందర్శించి సంక్షేమ పథకాలు గురించే వివరించడం, ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, రాష్ట్రబిసి అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి లక్ష్మి నారా యణ, వైసీపీ రాష్ట్ర కార్మిక సంఘ నాయ కులు దవులూరి సుబ్బరావు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైసీపీ కౌన్సిలర్‌లు పాగా సురేష్, జట్ల మోహన్, నేతల హరిబాబు, కోప్షన్ సభ్యులు సఖ్యారి కళ్యాణ్,అచ్చంపేట గ్రామ వైసీపీ నాయకులు, రూరల్ నాయకులు కొప్పిరెడ్డి రాధాకృష్ణ, వాసు, పార్టీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చంపేటలో 200వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కేక్ కట్‌చేస్తున్న హౌసింగు చైర్మన్ దవులూరి దొరబాబు

'టిడిపితోనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే ఒక్క టిడిపితోనే సాధ్యం అని మాజీ మంత్రి, పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. బోయినపూడిలో మంగళవారం మండల టిడిపి అధ్యక్షులు తోటకూర శ్రీనువాసు అధ్యక్షతన ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ చినరాజప్ప మాట్లాడుతూ సంక్షేమ పాలన పేరు చెప్పి జగన్ ప్రభుత్వం దొడ్డి దారిన విద్యుత్ చార్జీలు, ఆస్తిపన్ను, రిజిస్ట్రేషన్ సహా అన్ని చార్జీలు పెంచేసి అన్ని వర్గాల ప్రజలను దోచుకుతింటు న్నారని విమర్శించారు. ఇంటింటికి వెళ్లి జగన్‌ప్రభుత్వం చేపడు తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో గుమ్మళ్ళ రామకృష్ణ, కోటి, అడబాల కుమారస్వామి, బలుసువాసు, శంకర్, విజయ్ రాజు, అడబాల శ్రీహరి పాల్గొన్నారు.

బోయనపూడిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పర్యటనలో ఎంఎల్‌ఎ చినరాజప్ప

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కడియం

తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కాలువలో వేమగిరి ఎయిర్‌టెల్ సెల్ టవర్ ఎదురుగా గుర్తు తెలియని మృతదేహం మంగళవారం లభ్యమైందని కడియం పోలీసులు తెలిపారు. సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు కడియం పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు.

తమ్ముడిపై కోపంతో కలుపు మందు తాగిన అన్న

ప్రజాశక్తి - సీతానగరం

తమ్ముడిపై కోపంతో కలుపు మందు తాగి అపస్మారక స్థితికి చేరాడో అన్న. ఈ ఘటన సోమవారం రఘుదేవపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి సూర్య నారాయణకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడైన ప్రవీణ్ కుమార్ సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు భోజనం చేయడానికి సిద్ధపడ్డాడు. కూర విషయంలో తమ్ముడితో వివాదం జరిగింది. ఈ సమయంలో కోపంతో ఇంట్లో ఉన్న కలుపు మందును ప్రవీణ్‌కుమార్ తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు గమనించి వైద్యం నిమిత్తం 108లో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - యంత్రాంగం

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. వివరాలు ఇవి.

అమలాపురం అమలాపురం స్థానిక ఆదిత్య కాలేజీ ఎదురుగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమలాపురం మున్సిపల్ కాలనీకి చెందిన బైరిశెట్టి బాబి ఘటనా స్థలంలోనే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబి తన విధుల్లో భాగంగా ఉదయాన్నే సబ్బాణాయుడు చెరువు వద్ద పైపు వెతుకుతుండగా వెనక నుండి వేగంగా వచ్చిన మట్టి ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అతను మృతి చెందారు. బాబి మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు బాబి మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు. బాబి మృతి పట్ల పారిశుధ్య కార్మికులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. **నల్లజర్ల** నల్లజర్ల నుంచి కొవ్వూరు వెళ్లే 16వ నెంబరు జాతీయ రహదారిపై అప్పన్న పాలెం కాలనీ వద్దగల సర్వీస్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా పుల్లా గ్రామానికి చెందిన కొండేటి రాము(43) మృతి చెందారని పోలీసులు తెలిపారు. రాము వృత్తిరీత్యా నల్లజర్ల మండలంలోని నర్సీపేటలో ఓ ప్రైవేట్ జీడిగింజలు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వాహనం అదుపుతప్పడంతో పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

కుక్క దాడిలో గాయపడిన వృద్ధురాలు

పిచ్చి కుక్క దాడిలో 20 మందికి గాయాలు

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలో పిచ్చికుక్క దాడిలో 20 మందికి పైగా గాయపడ్డారు. మంగళవారం ఉదయం స్థానిక బొబ్బా విజయలక్ష్మి హాస్పిటల్, కలువపువ్వు సెంటర్, అక్షర స్కూల్ తదితర ప్రాంతాల్లో పిచ్చికుక్క పలువురిపై దాడి చేసి గాయపరిచింది. ఇదిలా ఉండగా పిచ్చికుక్క స్వైరహారంతో పట్టణ ప్రజలు హడలెత్తిపోతున్నారు ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పిచ్చికుక్కను బంధించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని బాధితులందరికీ వైద్య సదుపాయాలు అందిస్తున్నామని ప్రభుత్వాసుపత్రికి సూపరిడెంట్ ఉమానందిని తెలిపారు.

గోదావరిలో దూకి యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

కాకినాడ న్యూపోర్టు రైల్వే స్టేషన్ సమీపంలోని వెంకటేశ్వర నగర్‌కు చెందిన చదక వీరదుర్గాప్రసాద్(33) మంగళవారం ఉదయం యానాం బాలయోగి వారధినుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించగా ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ లభ్యం కాగా వాటిటో అడ్రస్‌ను బట్టి ఈవిషయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్టు తెలిపారు. దుర్గాప్రసాద్ బిఎస్‌సి బయోటెక్నాలజీ చదివాడని 2018లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి పరీక్ష రాసాడని అయితే ఎంపిక కాలేదన్నారు. దానితో మానసికంగా కుంగిపోయాడన్నారు. కాకినాడ కోర మండల్ పోర్టులోను సెక్యూరిటీ గార్డుగా పని చేశాడని దుర్గాప్రసాద్ తల్లి విలపిస్తూ తెలిపింది. మంగళవారం ఉదయం యానాం వచ్చిన దుర్గాప్రసాద్ స్థానిక బాలయోగి వారధి పైనుంచి గోదావరిలో దూకాడంతో అక్కడే ఉన్న ఎస్ఇజి జెట్టీ వద్ద ఉన్న కార్మికులు అది చూసి వెతికి ఒడ్డుకు చేర్చినప్పటికి అప్పటికే అతను మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నూకరాజు తెలిపారు.

ఆటపాటలతో విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-కొత్తపేట

క్రాంతి భారతి విద్యాసంస్థలలో మంగళవారం "ఆసమ్ కిడ్స్" ప్రోగ్రాం నిర్వహించారు. 6వ తరగతి నుంచి 9 వతరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం నుంచి ఇంగ్లిష్‌లో స్కిట్, డ్యాన్స్, సింగింగ్‌తో పాటు ఆటలతో సరదా సరదాగా సాయంత్రం వరకు గడిపారు. పోటీల్లో విజేతగా నిలిచిన వారిని స్కూల్ డైరెక్టర్ తోట సత్యవాణి, తోట వెంకటేశ్వరరావు, రమాదేవి ఉపాధ్యాయులు అభినందించారు.

యానాం వార్తలు

పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ ఏ ఓ మునిస్వామి, అధికారులు

ఘనంగా మహాత్మ పూలే జయంతి

ప్రజాశక్తి - యానాం

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ బాలిక కళాశాల ప్రాంగణంలో ఉన్న పూలే విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఎస్పీ రఘునాయగన్, ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు నివాళులర్పించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

15 నుంచి వేట నిషేధం అమలు

పుదుచ్చేరి ప్రభుత్వం ఆదేశాల మేరకు యానాంలో ఈనెల 15 నుంచి జూన్ 14 వరకు వేట నిషేధం అమల్లోకి ఉంటుందని మత్స్యశాఖ అధికారి డి గోంతియ్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని ఆయన తెలిపారు. మత్స్యకారులు తమ యొక్క బోట్లను, ఇంజిన్ నావలు, వలలు, వేట పరికరాలు సురక్షితమైన ప్రదేశాలలో భద్రపరచుకోవాలని కోరారు. మత్స్యకారులందరూ వేట నిషేధ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

అధికారుల వైఖరి మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటా

- ఎంఎల్ఎ అశోక్

ప్రభుత్వ అధికారుల వైఖరి మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షా సమయంలో ప్రభుత్వం ముందుంచిన 17 డిమాండ్లలో ఆరు డిమాండ్లను తక్షణం ఆమోదిస్తూ పనులు చేపట్టాలని ఆదేశించినప్పటికి ఇప్పటి వరకు సంబంధిత అధికారులు పనులు ప్రారంభించ లేదని వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆర్ఏఓ మునిస్వామిని కోరారు. మంగళవారం ఛాంబర్లో సమావేశం జరిపారు.

ఆర్ఎఓ మునిస్వామి తో చర్చిస్తున్న ఎంఎల్ఎ అశోక్

తన నిరాహార దీక్షా సమయంలో సిఎస్ఆర్ నిధులనుంచి 6 పనులను తక్షణం చేయాలని దీక్షా విరమణ సమయంలో హోంమంత్రి నమశ్శివాయం స్పష్టం చేశారన్నారు. కాని ఇప్పటివరకు పనులు ప్రారంభించకుండా పిడబ్ల్యుడి అధికారులు కాలయాపన చేస్తున్నారని, నిర్లక్ష్య వైఖరిపైన పనులు నిలిపివేతపైన తనకు కారణంగా సహ నివేదిక ఇవ్వాలని ఆర్ఏఓను స్పష్టం చేశారు. ఆదేశించిన ఎంఎల్ఎ, ఎంపి ల్యాడ్ నిధుల విడుదలయ్యాయని ఆ విధంగా 5 నెలలు కావస్తున్నా పనులు ప్రారంభించలేదని, ప్రజాసమస్యలపై అధికారులకు విలువ లేకుండా పోతోందని పనులు ప్రారంభించకపోతే సహించేది లేదన్నారు. ప్రస్తుత వేసవిలో తాగు, సాగునీరు ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అందుకు అనుగుణంగా కార్యచరణ చేపట్టినట్టు పిడబ్ల్యూడి జెఇ నాగరాజు తదితరులు తెలిపారు. సమావేశంలో అధికారులు జ్యోతిరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

యానాంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్ర స్వామి తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రధాన రహదారుల రోడ్ల పైన పార్కింగ్ నో పార్కింగ్ పెయింటింగ్‌లను వేయించారు. నిర్ణీతించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలపాలని, ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని కోరారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలుపకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా సహకరించాలని కోరారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా పోలీసులకు ప్రసంశా పత్రాలు అందించిన ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు

మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల ప్రాంతాలలో పనిచేస్తున్న ఐదుగురు మహిళ పోలీసులకు ప్రశంసా పత్రాలు, నగదు రివార్డును జిల్లా ఎస్‌పి ఎం. రవీంద్రనాథ్ బాబు అందజేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా గడచిన మార్చి నెలలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న ముద్దాయిలను పట్టించడంలోను, బాల్య వివాహాలను ముందస్తు సమాచా రంతో నివారించడంలోను, మానసిక స్థితి సరిగా లేని మహిళను గుర్తించి వారి బంధువులకు అప్పగించడం వంటి అంశాలలో మహిళా పోలీసులు చూపిన చొరవ ప్రశంసనీయమనారు ఈ సందర్భంగా మహిళా పోలీసులు బెండపూడి గ్రామం పాలెపు నిథిలా రాజ్, రౌతులపూడి గ్రామం జి చిన్నారి, తిరుమాలి గ్రామం ఎస్ గాయత్రి, దుగ్గిరాల వీధి, కాకినాడ పట్టణం సాధనాల నవ్యశ్రీ, మాధవపట్నం గ్రామం కోలా గంగాభవానిలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

'జగన్ పాలనలో అన్నీ సమస్యలే...'

ప్రజాశక్తి - కాకినాడరూరల్

ఒకే ఒక్క ఛాన్స్ వల్ల జగన్ పాలనలో ప్రజలకు అన్నీ సమస్యలేనని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి అన్నారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గం కాకినాడ రూరల్ మండల కేంద్రం కొవ్వాడ గ్రామంలో ఇంటింటికి మీ అనంతలక్ష్మి ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం'లో ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పని తీరును అడిగి తెలుసుకుంటూ ప్రజల సమస్యలను విని జగన్ పాలనా తీరు పై విచారం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మట్ట ప్రకాష్ గౌడ్, నరుకుర్తి ప్రసాదు, కమ్మ శ్రీను, చేకూరి వెంకట్రావు మారెళ్ళ రామకష్ణ, దుళ్ళ సత్యనారాయణ, పెంకె వీరబాబు దంగేటి వెంకటరమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

పజాశక్తి-రామచంద్రపురం

వారం రోజులుగా వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. ఉదయం పది గంటలు దాటిందంటే చాలు సుమారు 38 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. ఇక మధ్యాహ్న సమయానికి 39 డిగ్రీలు వేడి నమోదవుతునాయి. ఎండ వేడికి తాళలేక చిన్న పిల్లలు, వద్ధులు అల్లాడి పోతున్నారు. మెయిన్ రోడ్డులో జన సంచారం లేక కర్ఫ్యూ వాతావరణం నెలకొని ఉంది. వేసవిలో ఎండ వేడికి వాడ వాడలా చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో 40 డిగ్రీల పైగా ఎండలు నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు.

నిర్మానుష్యంగా రహదారి

పరిశ్రమల వార్షిక సర్వేపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - కాకినాడ

పరిశ్రమల వార్షిక సర్వే (ఏఎస్ఐ)పై ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించినట్లు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) కాకినాడ ఆఫీస్ ఇన్‌ఛార్జ్ బి.ప్రసాద్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాంపిల్ సర్వే కార్యాలయం ఏటా పరిశ్రమల సమాచార సేకరణకు వార్షిక సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే జాతీయ గణాంక చట్ట పరిధిలో పరిశ్రమల సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ చట్టంలో నమోదైన పారిశ్రామిక యూనిట్లకు ఇప్పటికే నోటీసులు అందజేశామని నెల రోజుల్లోగా ఏఎస్ఐ రిటర్న్‌లు సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు. రిటర్న్‌లను ఆన్‌లైన్ విధానంలో ఎలా సమర్పించాలనే దానిపై అవగాహన కల్పించేందుకు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా జరిమానాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ స్టాటిస్టికల్ అధికారులు ఆర్.శ్రీనివాస్, ఇ.రమేష్, యు.బేబీ కుమారి, ఏడీ కృపానిధి తదితరులతో పాటు 50 పారిశ్రామిక యూనిట్ల ప్రతినిధులు హాజరయ్యారు.

గిరీష్ బాబు కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటాలు

- మాజీ ఎంపి హర్షకుమార్

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బలుసుల పేటకు చెందిన ఆలపు గిరీష్ బాబు కుటుంబానికి న్యాయం చెయ్యకుంటే దశలవారీ ఆందోళనలు చేపట్టనన్నట్లు మాజీ ఎంపీ హర్షకుమార్ హెచ్చరించారు. మంగళవారం పోలీసుల వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన ఆలపు గిరీష్ బాబు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు జరుగుతున్న ప్రతి అన్యాయం దాడుల వెనుక వైసిపి రాష్ట్ర ప్రభుత్వం హస్తం ఉందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా శిరోముండన, శృంగవృక్షం దళిత యువకుడు మృతి కేసుల్లో ప్రభుత్వం పట్టించుకున్న తీరు ఏమీ లేదన్నారు. దళితులను హింసలకు గురి చేయడంతో పాటు దళిత పథకాలను అంతం చేస్తున్న ప్రభుత్వంగా వైసిపి తయారయ్యిందన్నారు. రాష్ట్రంలో ఎన్ని అరాచకాలు జరుగుతున్న ముఖ్యమంత్రి జగన్ దళితులకు ఏమాత్రం న్యాయం చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా వైసిపి ఉన్న దళిత నాయకులను ఆయన ఉద్దేశించి మాట్లాడుతూ మొదట మీరు పార్టీ నుంచి బయటపడి తదుపరి పార్టీలో ఉన్న దళిత ప్రజలందరినీ బయటకు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా గిరీష్ బాబు ఆత్మహత్య జరిగి సంవత్సరకాలం దాటిన దానికి కారకులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని తక్షణ వారిపై చర్యలు చేపట్టి కుటుంబానికి న్యాయం చేయాలన్న డిమాండ్ చేశారు. లేదంటే దశల వారి ఆందోళన కార్యక్రమాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టనున్నట్టు మాజీ ఎంపీ హర్ష కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పిట్ట జానకి రామారావు, కాపావరపు కుమార్ పాల్గొన్నారు.

17న సహకార ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న సిఐటియు ఆధ్వర్యంలో సహకార ఉద్యోగులు ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సహకార ఉద్యోగులకు జీవో 36 ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సహకరి ఉద్యోగుల కథ మూడు సంవత్సరాలుగా దసరా వారి ఉద్యమాలు చేపట్టిన ఫలితం లేకుండా పోయిందన్నారు. పిఎసిఎస్‌లో 50 శాతం వాటా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం, ఆర్‌బికె లను పిఎసిఎస్‌లో విలీనం చేస్తూ 1964 చట్టానికి సవరణ చేయడం రద్దు చేయాలని తదితర సమస్యలపై ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాకు జిల్లాలోని సహకార ఉద్యోగులందరూ విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సైన్స్ పరీక్షకు రెండు బుక్‌లెట్లు

10వ తరగతి విద్యార్థులకు పరీక్షల సంచాలకుల సూచన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఈ నెల 13వ తేదీ గురువారం జరగనున్న 10వ తరగతి సైన్స్ పరీక్ష రాసే విద్యార్థులకు ప్రశ్నాపత్రం ఒకటి ఇచ్చినప్పటికి ఆన్సర్ బుక్‌లెట్‌లు రెండు ఇస్తారు. 10వ తరగతి పరీక్షా రాసే విద్యార్థులకు ఈ సందర్భంగా ఫిజికల్ సైన్స్ (పి.ఎస్),న్యాచురల్ సైన్స్ (ఎన్.ఎస్)లుకు పరీక్షకు ప్రశ్నా పత్రం ఒక్కటే ఇచ్చినప్పటికి జవాబులు రాసేందుకు ఆన్సర్ షీట్ బుక్‌లెట్‌లు రెండు ఇవ్వనున్నారు. 10 సైన్స్ పరీక్ష గురువారం జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు రెండు ఆన్సర్ బుక్లెట్స్ లో రాయడం మర్చి పోకుండా గుర్తు చేసుకోవాలి.ప్రశ్న పత్రంలో 1 నుండి 16 వరకూ పిజికల్ సైన్స్ (పి.ఎస్), 17 నుండి 33 వరకూ (న్యాచురల్ సైన్స్) ఎన్.ఎస్ ప్రశ్నలు ఉంటాయి. ఈ విషయాన్ని పరీక్ష రాసే విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. రెండూ బుక్ లెట్స్ ఒకేసారి ముందుగా అందరికీ ఇవ్వడం జరుగుతుంది. మొత్తం 315 గంటల సమయంలో ముందు 15 నిమిషాలు ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా చదివి బాగా అర్థం చేసుకొని తర్వాత జాగ్రత్తగా గమనించాల్సిన అంశం పిఎస్‌లో రాయాల్సిన ప్రశ్నలు పి.ఎస్ జవాబు పత్రంలో అలాగే ఎన్ఎస్‌లో రాయాల్సిన ప్రశ్నలు ఎన్.ఎస్ జవాబు పత్రంలో రాస్తున్నారా లేదా అనేదే పరిశీలించడం ముఖ్యమైనది. సిలబస్ ఎక్కువగా ఉన్నప్పటికీ ఒక రోజ మాత్రమే సమయం ఉన్నది కాబట్టి చక్కగా చదివిన అంశాలనే మరలా రివిజన్ చేసుకొని ఒక మార్కు రెండు మార్కులు ప్రశ్నలు అన్నింటిని మరోసారి నెమరు వేసుకొని ,సమయాన్ని వృథా చేసుకోకుండా ధైర్యంతో, ఆత్మ విశ్వాసంతో పరీక్ష రాయాలని సూచించారు. ఈ మేరకు ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలకు ఈ సూచనలు జారీ చేశారు.

ప్రథమస్థానం, ద్వితీయ స్థానాల విజేతలతో ఆదిత్య సిబ్బంది

ఆదిత్య ఛాంపియన్ ట్రోఫీ విజేత 'ఇసిఇ'

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్‌లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఆదిత్య ఛాంపియన్ ట్రోఫీ-2023 క్రికెట్ పోటీలు మంగళవారంతో విజయ వంతంగా ముగిశాయి. తెలిపారు.

ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమే అని క్రీడలవల్ల దేహదారుఢ్య క్రమశిక్షణ, పోటీతత్వం పెంపొందుతాయి అని అన్నారు. పిజికల్ డైరెక్టర్ సి. హెచ్ మురళీమోహన్ మాట్లాడుతూ మొత్తం 82జట్లు పోటీలలో పాల్గొనగా ఆదిత్యా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన తతీయ సంవత్సరం ఇసిఇ జట్టు విన్నర్‌గా నిలిచి ట్రోఫీతో పాటు రూ.12000 బహుమతి గెలుపొందగా, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ మెకానికల్ జట్టు రన్నర్‌గా నిలిచి ట్రోఫీతో పాటు రూ.8000 బహుమతి సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్యా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ ఆదిరెడ్డి, డీన్ జె.డి.వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అరట్లకట్టలో వేసవి జలాశయం పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ ఆదనపు కమిషనర్ సిహెచ్. నాగ నరసింహారావు మంగళవారం అరట్లకట్ట లోని వేసవి జలాశయాన్ని సందర్శించారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ కృతికా శుక్ల, కమిషనర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశాల మేరకు వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి అరట్లకట్టలో సందర్శించారు. అనంతరం ఎడిసి నాగ నరసింహారావు మాట్లాడుతూ వేసవి జలాశయాన్ని పూర్తిగా నింపేందుకు ప్రస్తుతం 8 సబ్మెర్సిబుల్ పంప్ సెట్లను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 120 హెచ్ పి 4, 30 హెచ్ పి 2, 20 హెచ్ పి- 2 పంపుసెట్లు ఉన్నాయన్నారు. పంపింగ్ సమ యంలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయంగా అదనపు జనరేటర్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. వేసవి జలాశయంలో నీటి నిలువ సామర్థ్యం 6.5 మీటర్లు కాగా, ఇప్పటివరకు 3.2 మీటర్లు పూర్తయిందన్నారు. రానున్న వారం రోజులలో పూర్తిస్థాయిలో జలాశయం సామర్థ్యం మేరకు నిల్వచేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే సామర్లకోట లోని సాంబమూర్తి రిజర్వాయర్ లో కూడా పూర్తిస్థాయిలో మంచినీటి నిల్వ లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆ మేరకు ఇరిగేషన్ అధికారులు కూడా స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తీసుకున్న చర్యలు, కృషి కారణంగా రానున్న వేసవిలో ఎటువంటి మంచినీటి ఎద్దడి ఏర్పడే అవకాశం లేదని, ప్రజల అవసరాల మేరకు సమృద్ధిగా నీరు అందించగలమని ఏడిసి చెప్పారు. ఆయన వెంట వాటర్ వర్క్స్ డిఈ ప్రభాకర్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రకృతి' సాగు చేపట్టాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రైతన్నలు రబి పంటల కోతల అనంతరం ప్రకృతి వ్యవసాయ పంటలను నాటుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి, ప్రకృతి వ్యవసాయ డిపిఎం జె.ఎలైజా పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని రమణయ్య పేట గ్రామపంచాయతీ వద్ద పచ్చి రొట్ట, కూరగాయలు, చిరు ధాన్యాలు మొదలగు 31రకాల ప్రకృతి వ్యవసాయ విత్తనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి అనంతరం సాగుచేసిన పచ్చిరొట్ట వచ్చే పంటలకు ఎరువుగాను, పశువులకు మేతగాను కూడా వాడుకోవచ్చు అన్నారు. కాయకూరలు చిరుధాన్యాలతో రైతులు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ సాగును పొందిన వన పంటలు మధ్యలో కూడా సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘురామ కృష్ణరాజు, ఎంపిఇఒ దాడిశెట్టి దివ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మజ్జి నాగేశ్వరరావు, కొండేటి రాజా రత్నం, ముదర ఏసుబాబు, పొనగంటి వెంకటలక్ష్మి, సోమాల బుజ్జమ్మ,, సన్నపు సత్యవేణి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ విత్తనాలను ప్రదర్శిస్తున్న వ్యవసాయ సిబ్బంది

తూర్పుపాకలులో డ్రెయిన్ల పూడిక తీత పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తూర్పు పాకలు గ్రామంలో ప్రస్తుత వేసవిలో ప్రజలు రోగాల బారిన పడకుండా సర్పంచ్ అన్నపూర్ణ ఆదేశాల మేరకు పంచాయతీ ఆధ్వ ర్యంలో మంగళవారం డ్రెయిన్ల పూడిక తీతపనులు ప్రారంభించారు. ఈ పనులను గ్రామ వైసిపి ఇన్చార్జ్ పడాల వీర రాఘవులు పర్యవేక్షించారు.

పార్కులో తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘ సభ్యుడు ఐరెడ్డి వెంకట్రావు పార్కు సందర్శకుల దాహార్తిని తీర్చడానికి గాను మంచి నీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఎండల తీవ్రత వల్ల ఉద్యానవనంలో వాకింగ్ చేసే వాకర్స్, పార్కు సందర్శకుల సౌలభ్యం కోసం మంచినీటి సౌకర్యాన్ని కల్పించిన వెంకట్రావు సేవా తత్పరత అభినందనీయమన్నారు.

వాకలపూడిలో సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు వాకలపూడి గ్రామంలో మంగళవారం సచివాల యం-3 ప్రారంభించారు. అవినీతికి, వివక్షకు తావు ఉండకూడదని పరిపాలన ప్రజలకు చేరువ కావాలనే ప్రధాన లక్ష్యంతో సిఎం జగన్ ఈ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు

ఇంజరంలో 'జగనన్నే మా భవిష్యత్'

ప్రజాశక్తి - తాళ్లరేవు

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఇంజరం పంచాయతీలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. పంచాయతీ సర్పంచ్ ముద్దుల శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో గోపాలపురం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటింటికి అతికించారు. **పెద్దాపురం** పెద్దాపురం పట్టణ పరిధిలోని పలు వార్డులలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. **గండేపల్లి** మండలం ఎన్‌టి రాజాపురంలో జడ్‌పిటిసి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు ఆధ్వర్యంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్, రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలు అందించిన తీరు తెలుసుకున్నారు.

గౌడ సాధికారిక సమితి కన్వీనర్‌గా ఆదినారాయణ

ప్రజాశక్తి-కొత్తపేట

అమలాపురం పార్లమెంట్ జిల్లా టిడిపి గౌడ సాధికారిక సమితి కన్వీనర్‌గా మిద్దె ఆది నారాయణ నియమితులయారు. సభ్యులుగా రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన వెలుగుబట్ల త్రిమూర్తులు, ఆత్రేయపురం మండలం వెలిచేరు మాజీ సర్పంచ్ మిద్దె శ్రీరామ్మూర్తి, ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన వీరి గోపాలకృష్ణ నియమితులయ్యారు. వీరంతా రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావును ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని బండారు అభినందించారు. ఆయన మట్లాడుతూ టిడిపి బిసిల్లో అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తుందని గుర్తు చేశారు.

రఘురామ్‌తో ఆక్వా రైతులు

విద్యుత్ సబ్సిడీ కోసం ఆక్వా రైతుల వినతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

ఇటీవల కాలంలో తొలగించిన ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ జాబితాను పునరుద్ధరించాలని ఎపి సడా వైస్ ఛైర్మన్ వడ్డే రఘురామ్‌ను ఆక్వా రైతు సంఘం గౌరవ అధ్యక్షులు త్సవటపల్లి నాగభూషణం విన్నవించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 1200 విద్యుత్ సర్వీసులు సబ్సిడీ కోల్పోవడంపై పలువురు రైతులు రఘురామ్‌ను తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆక్వా రైతులు కోటిపల్లి ధర్మరాజు, త్సవటపల్లి నాగ భూషణం, తదితర రైతులు కలిసి అర్హత ఉండి విద్యుత్తు సబ్సిడీను ఆక్వా రైతులు ఏవిధంగా నష్టపోతున్నారో ఆయనకు వివరించారు వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని రఘురామ్ హామీ ఇచ్చారన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, EAST GODAVARI DIVISION

Tenders invited from contractors for NIT No.1 & 2/2023-24, Dt. 11-04-2023 in 3 Districts (Kakinada, East Godavari & Konaseema) for 2 works Est., cost varies from Rs.3.50 Lakhs to Rs.10.00 Laksh. Last Date for Receipt of Tender Dt.24-04-2023 upto 4:00 P.M.
Note: For further details can be viewed at https://tender.eprocurement.gov.in or contact 0884-2378457

Sd/- V.LAKSHMANA REDDY
Executive Engineer, APEWIDC, Kakinada

మహారాజశ్రీ 5వ అడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టు :: రాజమహేంద్రవరం
I.A.No. 415/2021
O.S.No. 205/2016

బిట్వీన్:
M/s. శ్రీ S.V.R.K. పౌల్ట్రీస్, రిజిష్టర్డ్ పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, Rep. by Its మేనేజింగ్ పార్ట్‌నర్ ఎ.వెంకటేశ్వరరావు (డైడ్), Rep. by Its పార్ట్‌నర్ అనపర్తి సత్యపాయి కుమారి
...పిటీషనర్లు /వాదులు
మరియు
ఆర్-2) దామరాజు కనకవల్లి, భర్త: రామచంద్రరావు, హిందూ, వయస్సు 55 సంగలు, R/o. శ్రీరక్ష అపార్ట్‌మెంట్, సోమాలమ్మ టెంపుల్ వీధి, శ్యామల నగర్, రాజమహేంద్రవరం.
...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు దావా గ్రంథములో శ్రీ కోర్టు వారి డిస్మిస్ ఉత్తర్వులు రద్దు చేయమని కోరుతు దాఖలు చేసిన పిటీషను ఐ.ఎ.నెం. 415/2021లో పై 2వ రెస్పాండెంటు దామరాజు కనకవల్లి గారి హాజరు నిమిత్తం ది.28-04-2023వ తేదీకు వాయిదా అయివున్నది. కావున పై ఐ.ఎ.నెం. 415/2021 పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన దామరాజు కలకవల్లి గార్కి ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై తేదీ **ది.28-04-2023వ తేదీ ఉదయం గంII 10:30 నిIIల లగాయితూ స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తెలియజేసుకొనవలెనని** లేని ఎడల వారి పరోక్షమందు పై పిటీషను ఐ.ఎ.నెం. 415/2021ను శ్రీ కోర్టు వారు తీర్మానించు దురని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సి. హెచ్.వెంకటేశ్వరరావు,
సి. హెచ్.దత్త కృష్ణ నిఖిత్,
రాజమండ్రి, 25-3-23. పిటీషనరు తరుపు అడ్వకేట్స్, రాజమండ్రి.

వేలం ప్రకటన
మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
ఇ.పి.నెం. 96/2017
ఇన్ ఓ.ఎస్.నెం. 9/2014
డి. హెచ్.ఆర్: విరోదుల రాజ్ కుమార్
జె.డి.ఆర్: ఆకుల సత్తిబాబు

పై నెంబరు డిక్రీ బాకీకి జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై కోర్టు వారి ఎదుట **ది.01-05-2023వ తేదీ ఉదయం గంII 10:30 నిIIల లగాయితూ వేలం కాబడును.** కావలసిన వారు పాడుకొనవచ్చును. మిగతా వివరములు పై కోర్టు వారి నజారత్ ఆఫీసు నందు తెలియచేయబడును.

షెడ్యూల్

తూర్పు గోదావరి (ప్రస్తుతం కాకనాడ జిల్లా) జిల్లా, పెద్దాపురం సబ్ రిజిస్టర్‌లో చేరిన పెద్దాపురం మండలం, పెద్దాపురం గ్రామం తాలూకు ఎస్.నెం. 223/2లో య.1-00 సెంట్లు లేక 0-404 హెక్టార్లు పల్లం భూమి ఈస్మెంటు హక్కులతో గల ఆస్తికి హద్దులు: ***తూర్పు:*** దున్న అచ్చిరాజు భూమి. ***దక్షిణం:*** కీలు అన్నవరం భూమి మరియు బొమ్మల గుడి మాన్యం. ***పడమర:*** బొంగు నాగేశ్వరరావు భూమి. ***ఉత్తరం:*** బుడత రాజ కామేశ్వరి భూమి కొంత మరియు దున్న అచ్చిరాజు భూమి కొంత.
డి. హెచ్.ఆర్ కిమ్మత్తు : రూ.3,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ.8,00,000/-
గమనిక: కోర్టు వారు ఇ.ఎ.నెం. 573/2018లో జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం తనఖా దస్తావేజు 2679/2013 తనఖా బాకీ లోబడ్డి వేలం కాబడునని గలమనించగలరు.
చావలి కృష్ణారావు
డి. హెచ్.ఆర్. తరుపున అడ్వకేట్, డో.నెం.9-1-32, ప్లీడర్ల వీధి, పెద్దాపురం.
సెల్: 98667 33570